ప్రజాశక్తి

సోమవారం 14 నవంబర్ 2022

8 పేజీలు






విశాఖపట్నం   అనకాపల్లి

పలుకుబడి బదిలీలు!

✦ బయటపడ్డ సిఫార్సు జాబితా
✦ అడ్డగోలు బదిలీలపై ఉపాధ్యాయుల ఆందోళన



ANNEXURE-IV

List of Teacher Transfers AP Model Schools

Name of the Person Designation	Present Place of Working	Request Place	Received from	Action to be taken by HoD
Smt.Bikkavolu Ramya, Sruthi PGT Botany	Model School, Lakkavarapukota, Vizianagaram District	Model School, Manchala Village, Cheedikada Mandal, Visakhapatnam District.	Sri Karanam Dharma Sri, MLA, Chodavaram Constituency.	Commissioner of School Education
			Smt.Piriya Vijaya, Chairperson, Zilla Parishad, Srikakulam	Commissioner of School Education
Smt.Yakala Anuradha, PGT, Maths	A.P.Model School, Pathapatnam, Srikakulam District.	A.P.Model School, Malakkayavalasa, Makkuva Mandal (or) Purohithunivalasa, Salur Mandal, Parvathipuram Manyam District	Sri Rajanna Dora Peedika, Deputy Chief Minister & Minister for Tribal Welafre, Govt of AP.	Commissioner of School Education
Smt.A.Nagamani, PGT, Zoology	AP Model School, Patipalli, Munagapaka Mandal, Visakhapatnam District	AP Model School, Mulakkayala Valasa, Makkuva Mandal, Vizianagaram District	Sri U.V.Ramanamurthy Raju (Kannababu), MLA, 32-Elamanchili Constituency, Visakhapatnam District	Commissioner of School Education
Sri G. Harish Kumar, PGT (Zoology)	A.P Model School, Chilamakuru, Anantapur District	AP Model Schools near to Nandyala Town(A.P.M.S.B ATMAKUR, or GOSPADU or MAHANANDI)	Sri Silpa Ravi Chandra Kishore Reddy, MLA, Nandyal	Commissioner of School Education
Sri.K.Pratap, TGT, Science	AP Model School,Matam Sariyapalli, Kanchili Mandal, Srikakulam District	AP Model School, M.S.Palli to AP Model School, Edulavalasa, Polaki Mandal, Srikakulam District.	Sri Thammineni Seetharam, Hon'ble Speaker Andhra Pradesh Legislative Assembly.	Commissioner of School Education
Mrs. Rubita Mishra , PGT (English)	AP Model School, Garbham, Merakamudidam, Vizianagaram District	Gantyada or Bhogapuram of Vizianagaram District	Hon'ble Min(Edn)	Commissioner of School Education
Sri Yerra Srinivasa Rao, PGT (English teacher)	AP Model School Shikaruganji, Dattirajeru, Vizianagaram District	AP Model School, Madhanapuram, Gantyada, Vizianagaram, Vizianagaram District	Sri Botcha Appalanarasayya, MLA, Gajapathinagaram	Commissioner of School Education

MALLEPOGU BHASKAR
JOINT SECRETARY TO GOVERNMENT

//ATTESTED//
SECTION OFFICER

ఉపాధ్యాయుల అక్రమ బదిలీ సిఫార్సు జాబితా

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అడ్డగోలు బదిలీలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణ బదిలీలకు ముందే సిఫార్సులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్న విషయం బయటకురావడంతో అర్హత కల్గిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి నగర సమీపంలోకి సాధారణ బదిలీల్లో వస్తామనుకుంటున్న ఉపాధ్యాయులంతా, వీటికి ముందే అక్రమ బదిలీలకు ప్రభుత్వం తెరలేపడంతో మంచి స్థానాలు కోల్పోతా మంటూ కలతచెందుతున్నారు. కావాల్సిన ఉపాధ్యాయులను నచ్చిన చోటకు తెచ్చుకొనే వరవడి ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. అప్పుడూ అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం జరిగినట్లు, ఇప్పుడూ జరగనుంది. కౌన్సెలింగ్‌తో నిమిత్తంలేకుండా నిబంధనలన్నీ పక్కనబెట్టి ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ సిద్ధపడ్డం విమర్శలకు తావిస్తోంది. గతంలో గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు వివిధ కారణాలు చూపి మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీల అండదండలతో జివిఎంసి పరిధిలోని పాఠశాలలకు వచ్చారు. ఆ అక్రమ బదిలీలను సరిచేయాల్సిందిపోయి, ఈ ప్రభుత్వమూ అదే తరహా బదిలీలకు సిద్ధపడుతోంది. పెద్దల సిఫార్సులతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 30 మంది బోధకులు అక్రమ బదిలీల ద్వారా కోరుకున్న పాఠశాలలకు రానున్నారు. పలుకుబడివుండి చెప్పించు కోగల్గిన అధ్యాపకులు, కెజిబివి, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత,

మిగతా 2లో..

అక్రమ బదిలీలు ఆపకపోతే ఆందోళన

కౌన్సెలింగ్‌తో నిమిత్తంలేకుండా జరిగే అక్రమ బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ఆపకపోతే రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమిస్తాం. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో చేసే అక్రమ బదిలీలతో సీనియర్ ఉపాధ్యాయులు, మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోనున్నారు.



గొంది చినబ్బాయ్,
యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి,
అనకాపల్లి జిల్లా

రాంబిల్లిలో రిబ్బన్ కంపెనీ

ప్రజాశక్తి-రాంబిల్లి :అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలో యమ ఇండియా రిబ్బన్ కంపెనీ నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ అనీల్ కుమార్, అనకాపల్లి ఎంపీ బీసెట్టి వెంకటసత్యవతి, యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకటరమణమూర్తిరాజు, చైనీస్ ఎంబసీ న్యూఢిల్లీ సెక్రటరీ యు యాంగ్, డబ్ల్యూయు జూన్ నిమి, ఎపిఐఐసి ప్రతినిధి ఎం.త్రినాధరావు, చైనా జనరల్ కాన్సులేట్ జహ లీయూ (కోల్‌కతా), యమ రిబ్బన్ ఇండియా డైరెక్టర్ స్టీవ్ హాజరై మాట్లాడారు. యమ రిబ్బన్ గ్రూప్ ప్రపంచంలోనే అతిపెద్ద రిబ్బన్లు, బౌస్ తయారీ సంస్థ అని తెలిపారు. రూ.300 కోట్ల పెట్టుబడితో 2000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. కొత్త యూనిట్‌లో ఎక్కువగా మహిళలే ఉంటారని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఉత్పత్తులను యుఎస్, యూరోపియన్ మార్కెట్‌కు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. కంపెనీ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు యమ ఇండియా కంపెనీ డైరెక్టర్ స్టీవ్ ధన్యవాదాలు తెలిపారు. 2023 డిసెంబరు నాటికి ట్రయల్ ఉత్పత్తిని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డైరెక్టర్ శివప్రసాద్, కంపెనీ మేనేజర్లు క్రాంతి కుమార్, శివ, జగన్, మోహన్, రవి, రామసురేష్, అశోక్, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, కంపెనీ ప్రతినిధులు

జగన్ స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు : సిపిఎం

▶ వార్త మెయిన్‌లో..

ఆర్‌కె.బీచ్‌లో నేవీ మారథాన్

▶ వార్త మెయిన్‌లో..

మేజర్ పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

▶ వార్త 2లో..



రమణారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అజశర్మ, గంగారావు తదితరులు

రమణారావు సేవలు ఎనలేనివి

వర్ధంతి సభలో వక్తలు

▶ వార్త 8లో..

పల్లెటూరును తలపించేలా శిల్పారామం

పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి





ప్రజాశక్తి-పిఎం.పాలెం

'పిక్నిక్ సందడితో శిల్పారామం కోలాహలంగా మారింది. అంతరించిపోతున్న చేనేత హస్తకళలకు, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలకు ప్రాణం పోస్తూ, వాటిని ప్రోత్సహిస్తూ, పల్లెటూరి వాతావరణం తలపించే విధంగా శిల్పారామం జాతరను తీర్చిదిద్దుతాం' అని మధురవాడలోని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. శిల్పారామం అభివృద్ధిపై ఆయన ప్రజాశక్తికి పలు అంశాలు తెలియజేశారు.

పిక్నిక్ పర్యాటకుల సంఖ్య ఎలా ఉంది?

కిందటి వారం నుంచి పిక్నిక్ సందడి మొదలైంది. ఇప్పటివరకు శని, ఆదివారాలలో శిల్పారామానికి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు. గత ఏడాది కంటే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే శని, ఆదివారాల్లో పర్యాటకులు 18 వేల మంది వరకు వస్తున్నారు.

పర్యాటకులకు ఏటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని గ్రీనరీని ఎప్పటికప్పుడు ఆకర్షణీయంగా తయారు చేయిస్తున్నాం. పర్యాటకులను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. మినరల్ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు ఏర్పాటుచేశాం.

స్విమ్మింగ్ పూల్ ప్రతిపాదన ఏమైంది?

ఇప్పటికే స్విమ్మింగ్ పూల్ పనులు 80 శాతం పూర్తి కావచ్చాయి. దీనిని డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే ప్లే ఎక్విప్మెంట్స్ ఉన్నాయి. శిల్పకళ బొమ్మలకు రంగులు దిద్దుతున్నాం. మరికొన్నిటికి త్వరలో రంగులు వేస్తాం. త్వరలోనే వాటర్ ఫాల్స్ వంటి సదుపాయాలు కూడా అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

శిల్పారామం ద్వారా ప్రజలకు ఏం లభిస్తున్నాయి?

25.53 ఎకరాల సువిశాలంగా శిల్పారామం ఉంది. పచ్చిక బయలు, పల్లెటూరు వాతావరణం కనిపించే శిల్పకళలు, హ్యాండ్లూమ్ క్రాఫ్ట్ ఉన్నాయి. శని, ఆదివారాల్లో సాంస్కృతిక జానపద ప్రదర్శనలు, అప్పుడప్పుడు హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్లు,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పలుకు'బడి' బదిలీలు!

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుంది.

చినగదిలి మండలం ఆరిలోవ ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న కె.విజయలక్ష్మిని ఇదే మండలంలోని సంతపాలెం పాఠశాలకు, సంతపాలెంలో పనిచేస్తున్న జివి.కృష్ణవేణిని ఆరిలోవ ఎంపిపి పాఠశాలకు బదిలీ చేయాలని, ఎస్.కోట జూనియర్ కాలేజీ కామర్స్ లెక్చరర్ ఎం.ప్రమీలను విశాఖపట్నం బాలిక జూనియర్ కాలేజీకి, రాంబిల్లి మండలం యుపి స్కూల్లో పనిచేస్తున్న కె.అరుణాదేవిని జివిఎంసి పరిధిలోని కొమ్మాది లేదా మధురవాడకు బదిలీ చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్.రాయవరం మండలంలోని కొరుప్రోలులో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ పి.విశ్వేశ్వరరావును అనకాపల్లి మండలంలోని దిబ్బపాలెం, లేదంటే గాజువాక, పెదగంట్యాడ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ చేయాలని మెగా ప్రదీప్ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది. పెందుర్తి మండలం నరవ ఎంపిపి స్కూల్‌లో పనిచేస్తున్న ఆర్.సంతోషికుమారిని పెందుర్తి మండలం అప్పన్నపాలెం లేదా చినగదిలి మండలం కెపి పురం, లేదా వెంకటాపురం, లేదంటే చినగదిలి, పెందుర్తి మండలంలో సమీప ఎంపిపి పాఠశాలకు బదిలీ చేయాలని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సిఫార్సు చేసినట్లు సమాచారం. బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న జనపరెడ్డి ప్రమీలను పెందుర్తి, లేదా సబ్బవరం మండలానికి బదిలీచేయాలని ఆదిబాబు, సబ్బవరం మండలం రవలమ్మపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఆకుల రఘును భీమునిపట్నం మండలం తాటితూరు పాఠశాలకు బదిలీ చేయాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణ, విజయనగరం జిల్లా డెంకాడ మండలం అక్కివరం మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న సామళ్ల శిరీషను మునగపాక మోడల్ స్కూల్‌కు బదిలీ చేయాలని శ్రీకాకుళం జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రియ విజయ, మునగపాక మండలం పాటిపల్లి మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఎ.నాగమణిని విజయనగరం జిల్లా మక్కువ మండలం ములక్కాయలవలస మోడల్ స్కూల్‌కు బదిలీ చేయాలని యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు సిఫార్సు చేసినట్లు ఉపాధ్యాయవర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇలా అధికార పార్టీ పెద్దల సిఫార్సులతో 30 మందికి బదిలీలు జరగనున్నాయి.

పల్లెటూరును తలపించేలా శిల్పారామం

నిర్వహిస్తున్నాం.

సిబ్బంది కొరత అలానే ఉందా?

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్నవారితోనే శిల్పారామం అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పర్యాటకుల సంఖ్య దృష్టిలో పెట్టుకుని అవసరమైన సిబ్బందిని త్వరలోనే తీసుకుంటాం.

శిల్పారామాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

శిల్పారామంలో ముందు తరాల నాటి కళలను, చేనేత హస్తకళలకు, సాంస్కృతిక, జానపద నృత్యాలకు మరింత ప్రాధాన్యతను కల్పిస్తాం. వాటిని ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతాం. శిల్పారామంలో 50 స్టాల్స్, వాటి పక్కనే ఫ్యామిలి రెస్టారెంట్ ఏర్పాటుచేస్తాం. పర్యాటకుల సంఖ్య పెంచి అంతరించిపోతున్న హస్తకళలకు ప్రాధాన్యత కల్పిస్తాం.

ప్రభుత్వ సహాయ సహకారాలు అందుతున్నాయా?

శిల్పారామం అభివృద్ధికి ప్రభుత్వం తరపున పిపిపి పద్ధతిలో రావాల్సిన రూ.11 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయి. ఢిల్లీలో ఉన్న భారత ప్రభుత్వం హ్యాండీక్రాఫ్ట్, హ్యాండ్ లూమ్స్ ద్వారా నిధులు వస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయి.

కళాకారులకు ప్రోత్సాహం ఏమైనా అందుతుందా?

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కళాకారులకు గతంలో రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు ఇచ్చేవాళ్ళం. ప్రస్తుతం శిల్పారామం ఇబ్బందుల్లో ఉండటంతో వారికి ప్రోత్సాహక నగదును ఇవ్వలేకపోతున్నాం. ప్రస్తుత కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో ప్రతి వారమూ నిర్వహిస్తున్నాం.

నిర్మాణదశలో ఆగిన పనులేప్పుడు పూర్తవుతాయి?

25.53 ఎకరాల విస్తీర్ణం కలిగిన శిల్పారామంలో కల్యాణ మండపం, 10 అద్దె గదులు ప్రస్తుతం నిర్మాణ దశలో ఆగిపోయి ఉన్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేస్తాం. ఏసీ కల్యాణ మండపంగా నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం.

5 స్టార్ హోటల్ నమూనా ఏమైంది?

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల కాలంలో పిపిపి పద్ధతిలో 3 ఎకరాల స్థలంలో పార్క్ అయ్యర్ హోటల్స్ ద్వారా 5 స్టార్ హోటల్ నిర్మాణం చేపట్టాలని ఒప్పందాలు అవుతున్నాయి. ప్రస్తుతం ఆ ప్రక్రియ అగ్రిమెంట్ దశ పూర్తికానందున పూర్తి స్థాయి అనుమతులు మంజూరు కాలేదు.

ఏడాదికి వచ్చే ఆదాయం ఎంత?

శిల్పారామంలో ఏడాదిలో ఇతర శుభకార్యాలకు వస్తున్న సందర్శకులను మినహాయించి నెలకు 10వేలు మంది చొప్పున సంవత్సరానికి లక్షా 20 వేలమంది సందర్శకులు వస్తున్నారు. నెలకు రూ.2 లక్షల ఆదాయం వస్తోంది. వాటిని శిల్పారామ నిర్వహణ పనులకు ఉపయోగిస్తున్నాం.

చేనేత ప్రదర్శనలు ఉన్నాయా?

రానున్న కాలంలో హ్యాండీక్రాఫ్ట్, హ్యాండ్ లూమ్స్ ప్రదర్శనలు, అమ్మకాలకు సంబంధించి భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అందులో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ నెలలో 15 నుంచి 30వ తేదీ వరకు హ్యాండ్లూమ్స్ క్రాఫ్ట్ మేళా నిర్వహిస్తాం. అనంతరం మరో రెండు మేళాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

క్రాఫ్ట్‌కు వస్తున్న ఆదరణ ఎలా ఉంది?

కరోనా తర్వాత ప్రస్తుతం చేనేత కళలకు ఆదరణ పుంజుకుంది. వేలసంఖ్యలో సందర్శకులు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో నిర్వహించిన హ్యాండ్లూమ్ క్రాఫ్ట్ మేళాలు ప్రజల సహకారంతో విజయవంతమయ్యాయి.

మేజర్ పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

- డిసెంబర్ 19న అన్ని పోర్టుల వద్ద నిరసనలు, ధర్నాలు

- పోర్టు ఫెడరేషన్ల కో-ఆర్డినేషన్ కమిటీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ : దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమైన ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేయకుండా ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశానికి హానికరమని దేశంలోని 5 గుర్తింపు గలిగిన పోర్టు ఫెడరేషన్ల కో-ఆర్డినేషన్ కమిటీ కో-చైర్మన్ పికె సమంతరాయ్, జనరల్ కన్వీనర్ పిఎం మహమ్మద్ హనీఫ్ తెలిపారు. ఐదు ఫెడరేషన్ల సమావేశం శని, ఆదివారాలలో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. సమావేశంలో చేసిన నిర్ణయాలను వివరించడం కోసం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్ లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 11 మేజర్ పోర్టులు ఉన్నాయన్నారు. 10 మేజర్ పోర్టులోని 35 బెర్తులను అదాని, అంబానీలకు కట్టబెట్టారని విమర్శించారు. విశాఖపట్నం మేజర్ పోర్ట్ లోని 31బెర్తులు ఉండగా వీటిలో పదింటిని ఇప్పటికే ప్రైవేటీకరణ చేశారని, మరో 4 బెర్తులను ప్రైవేటీకరణ చేయడానికి ఏర్పాటు చేశారని తెలిపారు. పోర్టుల ఆర్థిక స్థితి బలహీనంగా ఉందని ఆదాయపు కొరతను ఎదుర్కోవడానికి ప్రైవేటీకరణ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. పోర్టు ఉద్యోగులపై అనేక పొదుపు చర్యలను విధించిన కేంద్రం, బిఒటి ఓటర్లకు అన్ని రాయితీలు కల్పిస్తున్నారని తెలిపారు. ఏటా ఇవ్వాల్సిన బోనస్‌ను ప్రోడక్టివిటీకి లింకు చేశారన్నారు. రెండేళ్లుగా బోనస్ చెల్లించటం లేదన్నారు. పిఎల్ఆర్ లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్లకు ఒకసారి జరగాల్సిన పేరివిజన్ గడువు పూర్తయినప్పటికీ ఏడాది కాలంగా కాలయాపన చేస్తున్నారన్నారు. ట్రస్టీల నియామకాలను పూర్తిగా మార్చేశారన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 19న అన్ని మేజర్ పోర్టుల ఎదుట అన్ని ఫెడరేషన్ల ఆధ్వర్యాన పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఫెడరేషన్ కోశాధికారి బిసిహెచ్ మసేన్ మాట్లాడుతూ, దేశ ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మలుగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు జికె.కృష్ణమూర్తి, డికె.శర్మ, సిఐటియు నాయకులు సిడి.నందకుమార్, వివిఎస్.పద్మనాభరాజు, ఎఐటియుసి నాయకులు ఎస్ఎస్.శ్రావణ్, వైఎస్.ప్రకాశరావు, ఐఎన్‌టియుసి నాయకులు ఎ.బలరామన్, జి.చందు, ఎస్ఆర్ ఎపరాజ్, టిఎ.నరేంద్రరావు, ఎల్.సత్యనారాయణ, ఎన్‌వి.రాజేంద్రన్, కె.మంగయ్య నాయుడు, థామస్ సెబస్టియన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పికె.సమంత్ రాయ్

ఎల్ఐసి క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో నవంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా ఎల్ఐసి క్రీడా పోటీలకు విశాఖపట్నం ఎల్ఐసిలో పనిచేస్తున్న జివి.పద్మావతి (క్యారమ్స్), వి.జోత్స్న (టేబుల్ టెన్నిస్), ఎల్.సురేంద్రబాబు (షటిల్ బ్యాట్మెంటన్) ఎంపిక కావడంతో వారిని, టీం మేనేజర్‌గా ఎంపికయిన డివిఎస్‌వై శర్మను ఎల్ఐసి సీనియర్ డివిజన్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి విశాఖపట్నం డివిజనల్ పర్సనల్ మేనేజర్ కె.భగవాన్ ప్రసాద్, స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఐసి నుంచి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరిస్తున్న సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్‌బాబు

ప్రధాని పర్యటన విజయవంతం : జివిఎల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటన విజయవంతమైందని రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు చెప్పారు. లాసన్స్ బే కాలనీలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగతంగా తన అభ్యర్థన మేరకే విశాఖలో సభ జరిగిందని తెలిపారు. అనేక ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనలు జరగటం రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇస్తున్న సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని పర్యటనకు ఒక రోజు ముందే అంటే ఈ నెల 10న రైల్వే జోన్‌ను నిర్ధారిస్తూ నోటిఫికేషన్ వెలువడిందని తెలిపారు. రాయగడ జోన్, సౌత్ కోస్ట్ జోన్లకు రూ.106 కోట్లు మంజూరు చేశారన్నారు. జోన్ ప్రధాన కార్యాలయం ఎక్కడ నిర్మించాలో రైల్వే మంత్రి తనిఖీ చేశారని తెలిపారు. నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ఎనిమిది సెంటర్లలో ఒకటి విశాఖకు దక్కిందన్నారు. కార్యక్రమంలో బిజెపి నగర అధ్యక్షుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రైల్వే చెస్ ఛాంపియన్‌గా విఘ్నేష్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అఖిల భారత రైల్వే చెస్ ఛాంపియన్‌షిప్ ఆదివారం విశాఖపట్నంలోని శ్రీశుభం ఇండోర్ కాంప్లెక్స్‌లో ముగిసింది. టీమ్, వ్యక్తిగత టోర్నమెంట్‌లలో విజేతలకు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ కుమార్ సత్పతి బహుమతులు అందజేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో 34వ ఆల్ ఇండియా రైల్వే చెస్ ఛాంపియన్‌షిప్‌ను విఘ్నేష్ గెలుచుకున్నాడు. సదరన్ రైల్వే టీమ్ వ్యక్తిగతంగా అనంతరామ్ రెండింటినీ గెలుపొందడం ద్వారా డబుల్‌ని కైవసం చేసుకున్నాడు. సెంట్రల్ రైల్వేకు చెందిన జిఎం స్వప్నిల్ ధోపడే రన్నరప్ స్థానాన్ని దక్కించుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన పి.కార్తికేయన్ రెండో రన్నరప్‌గా నిలిచాడు.

'వాసవి' డిస్ట్రిక్టు గవర్నర్‌గా నాగరాజు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు గవర్నర్‌గా డాక్టర్ కందుల నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంలోని డాక్టర్ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ వేముల హాజరత్ గుప్తా, గౌరవ అతిథిగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ, గతం కంటే భిన్నంగా 102 మందితో క్యాబినెట్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. వాసవి క్లబ్‌ను కుల సంఘంగా చూడకూడదని, పేదప్రజల సేవ చేయడమే లక్ష్యంతో ఏర్పాటైన స్వచ్ఛంద సంస్థ అని చెప్పారు.

సచివాలయ భవనం ఏర్పాటులో వివాదం



కనమాంలో నిర్మిస్తున్న సచివాలయ భవనం

- ▶▶ ముచ్చర్ల పేరును మార్చేయడంపై ఆందోళన
- ▶▶ కనమాంలో నిర్మించడానికి ఆసక్తి ఏమిటని ప్రశ్న
- ▶▶ రెండు పంచాయతీల మధ్య చిచ్చు పెట్టొద్దని వినతి
- ▶▶ స్పందించకుంటే ఆందోళనకు సిద్ధమని హెచ్చరిక

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని ముచ్చర్ల గ్రామపంచాయతీ సచివాలయం భవనం ఏర్పాటుపై వివాదం ముదురుతోంది. ముచ్చర్లలో ఇప్పటికే పంచాయతీ భవనం ఉండడంతోపాటు కొత్తగా సచివాలయ నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, సచివాలయాన్ని ముచ్చర్లలో కాకుండా అక్కడకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కనమాంలో నిర్మించాలనుకోవడంలో ఆంతర్యం అంతుపట్టడం లేదని స్థానికులు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని26 గ్రామపంచాయతీలకు గాను ఏర్పాటు చేసిన 18 గ్రామ సచివాలయాలలో ముచ్చర్ల కూడా ఉంది. అయితే ముచ్చర్ల సచివాలయ భవనాన్ని ముచ్చర్లలోకాకుండా, ఇందులో రాజకీయాలు జోక్యం చేసుకుని, కనమాం గ్రామపంచాయతీ కేంద్రంలో ఏర్పాటుపై ముచ్చర్ల గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ముచ్చర్ల గ్రామ సచివాలయం పరిధిలో 1181 ఇల్లు ఉన్నాయి. అలాంటిది ముచ్చర్ల పేరుతో ఉన్న కేంద్రంలో కాకుండా సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనమాంలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేసే, వీరంతా ఏదైనా పని వస్త అక్కడకు వెళ్లాలనడం ఎంతవరకు సమంజమని ముచ్చర్ల వాసులు ప్రశ్నించారు. ముచ్చర్లలో కాకుండా, వేరేచోట సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందరికీ ఇబ్బందులకు గురిచేయాలనుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి ప్రభుత్వ రికార్డులలో ముచ్చర్ల సచివాలయంగా నమోదై ఉన్నప్పటికీ, భవనాన్ని ఇక్కడ ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నిస్తున్నారు. భవన ఏర్పాటుకు స్థలం ఉన్నా, సచివాలయం వేరేచోట ఏర్పాటును వీరంతా జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కరించడంతో ఆ పార్టీ స్థానిక నేతలు ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నిన్నారు. కాగా దీనిపై వైసిపి నాయకుడు, స్థానిక సర్పంచ్ శినగం ఎర్రయ్య అనేకసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా, సచివాలయ భవనాన్ని కనమాం పంచాయతీకి తరలిపోవడంతో ఆంతర్యం తమకు అర్థం కావడం లేదని వాపోతున్నారు. కమనాంలో నే సచివాలయ భవనాన్ని నిర్మించాలని ఆసక్తి ఉంటే, ముచ్చర్ల నుంచి దాన్ని వేరుచేసి, ముచ్చర్లలో వేరేగా సచివాలయ భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

దీనిపై గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా, రెవెన్యూ రికార్డులలోముందుగా ముచ్చర్ల గ్రామ సచివాలయం అని ఉండేదని, అయితే ఇటీవల కనమాం సచివాలయం అని పేరు మారుతూ వచ్చిందన్నారు. దీనిపై తమకు స్పష్టమైన ఆదేశాలేవీ లేవని అంటున్నారు.

ముచ్చర్లలోనే సచివాలయం ఏర్పాటు చేయాలి



సచివాలయ భవనాన్ని ముచ్చర్ల గ్రామంలోనే ఏర్పాటు చేయాలి. ఉన్న ఫలానాపేరు మార్చి వేరే చోట ఏర్పాటు చేస్తామంటే ఒప్పుకోం.దీనిపై రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా సమైక్యంగాఉద్యమిస్తాం.

శినగం గంగునాయుడు, ముచ్చర్ల గ్రామస్తుడు

పేరు మార్చడం సరికాదు



ఆనందపురం మండలంలో ముచ్చర్ల పేరుతోనే ఇన్నాళ్లు సచివాలయం కొనసాగింది. ఇపుడు సచివాలయం పేరు మార్చి వేరే పేరుతో, ఇంకో గ్రామంలో ఏర్పాటు చేస్తామంటే చూస్తూ ఊరుకోం. దీనిపై ఎమ్మెల్యే, అధికారులు స్పందించాలి.

పి శివసత్యం

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



జూపార్కులో పాపాహోమ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, ఎడ్యుకేషన్ బృందం ఆధ్వర్యంలో జూపార్కులో విద్యార్థులకు పాపాహోమ్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా విద్యార్థులకు జూ పార్కులో ఉన్న జంతువులను చూపిస్తూ వాటి గురించి వివరించారు. జూ బయోస్కోపు మందిరంలో నిర్వహించిన జంతువులకు సంబంధించిన యాక్టివిటీలో డిఎఫ్ఒ అనంత శంకర్, క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా పాల్గొని ఫోటోలలో ఉంచిన వివిధ రకాల జంతువుల చర్మాలను గురించి వివరించి, విద్యార్థులతో చెప్పించారు. విద్యార్థుల కోసం ట్రెజరర్ హంట్ గేమ్ నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జంతువుల ఆకారంలో ఉన్న మాస్కులను, సర్టిఫికేట్లను, బహుమతులను అందజేసారు.

ఆహ్లాదకరంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పబ్లిక్ లైబ్రరీలో బాలల దినోత్సవాన్ని ఆదివారం ఎంతో ఆహ్లాదకరంగా నిర్వహించారు. కథా రచయిత్రి సీతా శ్రీనివాస్ తోలుబొమ్మల సాయంతో ఉత్తర ధ్రువంలో నివసించే సాహసోపేత ధవపు ఎలుగుబంటి కథతో పిల్లలను ఆర్కిటిక్‌లోకి తీసుకెళ్లారు. మంచులో లోతైన పగుళ్లలో చిక్కుకున్న హస్కీ కుక్క పిల్లను ఎలా కనుక్కుంటాడో పిల్లలకు వివరించారు. అతను కుక్కపిల్లని ఎలా రక్షించాడు, ఆశ్చర్యకరమైన ప్రయాణాన్ని చేపట్టడం ద్వారా అతని కుటుంబాన్ని కనుగొనడంలో ఎలా సహాయం చేస్తాడు వివరించి పిల్లలను అదే ట్రాన్స్‌లోకి తీసుకెళ్లారు. పిల్లలకు గ్లోవ్ తోలుబొమ్మలు ఇచ్చి వాటిద్వారా సొంత కథలను సృష్టించి చెప్పడమెలాగో ప్రోత్సాహించి, వారితో చేసి చూపించారు. ఈ సందర్భంగా రెండవ తరగతి విద్యార్థి ప్రజ్వల్ 'ఎలిఫెంట్ అండ్ ది హిప్పో' కథను వివరించగా, అతడిని అభినందించారు. వైభవ్ కార్తీక్, ధ్రువిక, ఉదయశ్రీ, మహిమాన్విత, ఆమె స్నేహితులు 'ఒక గాడిద తన ఆశ్రయాన్ని కనుగొనే కథను వివరించారు. ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో బాలల దినోత్సవ వేడుక సాగింది.

క్రీడలకు 'ఉపకార' సంస్థ ఆర్థిక సాయం



క్రీడాకారులకు ఆర్థిక సాయం ఇస్తున్న ఉపకార సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ: క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ఉపకార సంస్థ అధినేత కంచర్ల అచ్యుతరావు క్రీడాసంస్థకు రూ.50వేలు నగదును వితరణగా ఆందజేశారు. ఆదివారం ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆటల పోటీల ముగింపు సందర్భంగా ఆ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరిలోవ ఎస్ఐ అనికుమార్, టిడిపి నాయకులు మద్దిల రాజశేఖర్, ఉపకార సంస్థ సభ్యులు ఎస్.అప్పారావు, సిద్ధు పాల్గొన్నారు.

200మందికి గుండె పరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని చందక గ్రామంలో ఇండస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా గుండె వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎడ్ల బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మందికి వైద్యసేవలు అందించారు. ఇండస్ ఆసుపత్రి చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో అదే ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వి.సుజాత, డాక్టర్ ఎం నరసింహరెడ్డి, ఎం రమేష్ నాయుడు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.



చందకలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంక శ్రీను వైసిపి సీనియర్ నేతలు బంక సత్యనారాయణ, గుసిడి రమణ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.మహేష్ తెలిపారు.వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, ఈనెల 20న ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు. వారోత్సవాలను పాఠకులకు, స్థానికులు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు

నేవీ మారథాన్‌లో కెజిబివి విద్యార్థులు



నేవీ మారథాన్‌లో సాధించిన జ్ఞాపికతో విద్యార్థినులు

ప్రజాశక్తి-ఆనందపురం: విశాఖ బీచ్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన నేవీ మారథాన్‌లో ఆనందపురం కెజిబివి విద్యార్థినులు పాల్గొని పలు ప్రదర్శనలు ఇచ్చారు. నేవీ కమాండ్స్ విన్యాసాలలో భాగంగా భీమునిపట్నం కెజిబివి నుంచి 20మంది విద్యార్థులు, ఆనందపురం నుంచి 15 మంది, పద్మనాభం నుంచి 15 మంది మొత్తంగా 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నేవీమారథాన్ 5కె రన్‌లో పాల్గొని, ప్రతిభ చూపడం ద్వారా మెమెంటో, టీషర్టులను సాధించారు. నేవీ మారథాన్‌లోకస్తూర్బా పాఠశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించినందుక తూర్పు నావికాదళం అధికారులకు ఎసిపి శ్రీనివాసరావు, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి చంద్రకళ, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు

సందర్శకులతో పార్కులు కిటకిట



జూపార్కులో సందడి చేస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రెండో శనివారం, కార్తీకమాసం మూడవ ఆదివారం వరుస సెలవు దినాలు కావడంతో నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాల కొండ, ముడసర్లోవ పార్కులు సందర్శకులతో సందడిగా మారాయి. ఆదివారం ఉదయం నుంచి ఇటు హనుమంతువాక నుంచి జూ పార్కుకు వెళ్ళే రహదారులు, అటు హనుమంతువాక నుంచి అడివివరం వైపు వెళ్ళే బిఆర్‌టిఎస్ రోడ్డు ప్రయాణికులతో వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. ముఖ్యంగా జూపార్కుకు, కంబాల కొండ ఎకొ టూరిజం, ముడసర్లో పార్కులు సందర్శకులతో కిటకిటలాడాయి. ఎక్కువ మంది కుటంబ సభ్యులు, కుల సంఘాలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో గుంపులుగా పార్కులకు వచ్చి ఆట పాటలతో సరదాగా గడిపారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను ఆదివారం 19,159 మంది సందర్శించగా, . వీరి నుంచి రికార్డ్ స్థాయిలో రూ. 9.61 లక్షల ఆదాయం సమకూరిందని జూ అధికార్లు తెలిపారు.

సందడిగా ముడసర్లోవ పార్కు..

ముడసర్లోవ పార్కును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు, కొన్ని మౌలిక వసతులు కల్పించడంతో ఈ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. చుట్టూ కొండలు మధ్యలో నిండికుండలా రిజర్వాయర్ పార్కు ప్రదేశం ప్రశాంతంగా ఉండడంతో నగర నలుమూలల నుంచి సందర్శకుల రావడంతో పార్కు సందడిగా మారింది.

ఆత్మీయ కలయిక..

నగరంలో లంకపల్లి బుల్లయ్య కళాశాల 1991-96 బ్యాచ్ విద్యార్థులు 26 ఏళ్ళ తరువాత మొదటిసారిగా ముడసర్లోవ పార్కులో ఆదివారం కలుసుకున్నారు. సినీనటుడు హర్ష పాత మిత్రులను కలుసుకుని వారితో సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరదాగా గడిపారు. ఏటా కలుసుకోవడంతోపాటు ఒక సంస్థగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

యాదవ మహిళా సంఘం ఆధ్వర్యంలో.

విశాఖ జిల్లా యాదవ మహిళా సంఘం ఆధ్వర్యంలో ముడసర్లోవ పార్కులో వనభోజన కార్యక్రమంలో ి నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు పాల్గొన్నారు. మేయర్ స్వయంగా వడ్డించి సందడి చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పల్లా చిన్నతల్లి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు పాల్గొన్నారు.



వనసమారాధనలో మేయర్ హరి వెంకటకుమారి

స్నేహితుల ఆర్థిక చేయూత



మనోహర్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ప్రజాశక్తి -తగరపువలస/ పద్మనాభం: రోడ్డు ప్రమాదంలో మరణించిన స్నేహితుడి కుటుంబానికి తోటిమిత్రులు ఆర్థికసాయంతో ఆపన్నహస్తమందించి అండగా నిలిచారు. ఆనందపురం మండలం, లొడగలవానిపాలేనికి చెందిన గుజ్జు మనోహర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు జివిఎంసి ఒకటో వార్డు, బంగ్లామెట్టకు చెందిన రెడ్డిపల్లి అప్పలరాజు, వాడపల్లి భాను ప్రసాదరావు, ఎద్దు అప్పలరాజు, ఎం సన్నిబాబు, ఎ.ధనరాజు, ఎన్ పద్మరాజు, పెంటయ్య తదితరులు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం వీరంతా లొడగల వానిపాలెంలోని మనోహర్ ఇంటికి వెళ్లి, అతని తల్లి, భార్యలకు అర్థికసాయం అందించారు. భవిష్యత్‌లోనూ అన్ని విధాలా అండగా ఉంటామని స్నేహితుడి కుటుంబానికి భరోసానిచ్చారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన



అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-పద్మనాభం : చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, ప్రతిఒక్కరూ బాగా చదివి తమ భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని ఎంపిపి కంటుబోతు రాంబాబు అన్నారు. ఆదివారం ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర సీనియర్ నేత, మాదిగ దండోరా పద్మనాభం మండల వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాపల్లి గణేష్ తన స్వగ్రామం మండలంలోని కోడగుడ్లు పెంట గ్రామంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ, పలు పథకాల ద్వారా ప్రోత్సాహాన్ని అందిస్తోందని , వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, ఇతర నేతలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఎంపిపి రాంబాబును కోడిగుడ్లపెంట గ్రామస్తులు మేళతాళాలలో ఘనంగా స్వాగతించారు. వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎంఎ విశాఖపట్నం బ్రాంచ్ కోశాధికారి

మురళీమోహన్‌కు ఎపి కాన్ఫరెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచ్ కోశాధికారి ఎంవివి.మురళీమోహన్‌కు ఐఎంఎ ఎపి కాన్ఫరెన్స్ అవార్డు దక్కింది. ఆదివారం నంద్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎం ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరాజు నుంచి మురళీమోహన్ అవార్డు అందుకున్నారు. మురళీమోహన్ సేవలకు గుర్తింపుగా అవార్డును అందజేస్తున్నట్లు ప్రకటించి, ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ రవికృష్ణ, సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఫణిధర్, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ పి.ఎ.రమణి, వైద్యాధికారులు పాల్గొన్నారు

యోగా పోటీల విజేత విశాఖి

రెండో స్థానంలో నెల్లూరు .. మూడో స్థానంలో కృష్ణా, కర్నూలు జట్లు



ప్రథమస్థానంలో నిలిచిన విశాఖ యోగా క్రీడాకారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 47వ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ -2022 యోగాసన పోటీలలో విశాఖ జిల్లా క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. శనివారం ప్రారంభమై, ఆదివారంతో ముగిసిన ఈ పోటీల్లో ఉమ్మడి రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొని, యోగాసనాల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు.

59పాయింట్లతో విశాఖ టాప్

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో 59 పాయింట్లతో మొదటి స్థానంలో విశాఖ జట్టు నిలిచింది. 22 పాయింట్లతో నెల్లూరు రెండోస్థానంలోనూ, 21పాయింట్లతో మూడో స్థానంలో కష్ణా, కర్నూలు జిల్లాల జట్లు సమ ఉజ్జీలుగా మూడోస్థానంలో నిలిచాయి. జట్టుపరంగానూ, వ్యక్తిగతంగా ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు 2023 జనవరి 13-17 తేదీల్లో తమిళనాడు తిరుమన్నామలైలో జరుగనున్న జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఔరా అనేలా ప్రతిభ కనబరిచిన శిరీష

విభిన్న రీతుల్లో యోగాసనాలు వేస్తూ అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఇప్పటికే పలు బంగారు, వెండిపతకాలు సాధించిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన టి శిరీష, ఈ పోటీల్లోనూ ఔరా అనిపించేలా వేదికపై పలు భంగిమల్లో యోగాసనాలు ప్రదర్శించారు. శిరీష ప్రతిభను పలువురు ప్రశంసలతో ముంచెత్తారు.

రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2,3 వార్డుల వైసిపి ఇన్‌ఛార్జిలు ఎస్ కరుణాకరరెడ్డి, మైలపల్లి షణ్ముఖరావు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, సెయింట్ ఆన్స్ పాఠశాల కో ఆర్డినేటర్ సిస్టర్ థెరీసా మేరీ , యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ఎఆర్‌కె వర్మ, ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా అధ్యక్షులు రవి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు రామారావు, ఎస్‌జిఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరెడ్డి, పాఠశాల పిఇటి ఎన్ శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన న్యాయ చైతన్య వారోత్సవాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి తిరుమలరావు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ న్యాయ సేవలు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు వారాలపాటు నిర్వహించిన ప్రత్యేక న్యాయ చైతన్య కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. జిల్లా న్యాయ సేవా సదన్‌లో డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.తిరుమలరావు మాట్లాడుతూ, రెండు వారాల పాటు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో పలు విద్యాలయాల్లోనూ న్యాయ చైతన్య సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 'మత్తు పదార్థాలు విడనానండి సే నోటు డ్రగ్' నినాదంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించిందన్నారు. ఇందులో భాగంగానే జల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవివి బులికృష్ణ విశాఖ సెంట్రల్ జైలును సందర్శించి, ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు వారికి ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారన్నారు. అలాగే అరకులో రెండు వేల మందితో 'సే నో టు డ్రగ్' అంశంపై రెండు వేల మందితో ర్యాలీ చేపట్టామన్నారు. ముగింపు సందర్భంగా విశాఖలోనూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు బైపారుణ్ కుమార్, వివిధ న్యాయ కళాశాలల విద్యార్థులు, పారాలీగల్ వాలంటీర్లు, ప్యానల్ లాయర్లు, ధాత్రి స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహాచలంలో ట్రాఫిక్ కష్టాలు

అసంపూర్తి బిఆర్‌టిఎస్ రోడ్డు వల్లే అనునిత్యం అవస్థలు
ఇరుకురోడ్డులో ఎదురెదురుగా వచ్చిన వాహనాలతో ఇరుక్కుపోయిన ప్రజలు



సింహాచలంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం ప్రాంతంలో ప్రధానరోడ్డులో భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం సెలవు కావడంతో అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులతోపాటు కార్తీకమాసం రెండో ఆదివారం కావడంతో పిక్నిక్‌లకు వచ్చే వారితో తీవ్రమైన రద్దీనెలకొంది. భారీ ఎత్తున బస్సులు, కార్లు, బైక్‌లతోపాటు స్థానికంగా తిరిగే ఆటోలు, సిటీబస్సులు, ఇతర వాహనాలతో సందర్శకులు, భక్తులు తరలిరావడంతో రోడ్డుపొడుగునా వాహనాలు నిలిచి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కొంతకాలంగా బిఆర్‌టిఎస్ రోడ్డు పనులు పెండింగ్‌లోనే నిలిచిపోవడంతో, అడవివరం నుంచి సింహాచలం అటుఇటుగా కొద్దిదూరం రోడ్డు ఇరుకుగా ఉండడం, అదే సమయంలో పెద్దఎత్తున ఎదురెరుగా వాహనాలు రావడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. సుమారుమూడు గంటలపాటు వాహనచక్రబంధంలో ఈ మార్గమంతా ఇరుక్కుపోవడంతో అటుగా ప్రయాణించే భక్తులతో పాటు స్థానికులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించి మూడు గంటల తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆడవివరం నుంచి గోశాల వరకు అసంపూర్తిగా ఉన్న మిగిలిన బిఆర్‌టిఎస్ రోడ్డును కూడా త్వరిగగతిన పూర్తిచేసేందకు చర్యలు చేపట్టడం ద్వారా ఈ మార్గంలో ట్రాఫిక్ కష్టాలకు విముక్తి కల్పించాలని అప్పన్న భక్తులతోపాటు స్థానికులు వాహనదారులు కోరుతున్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు

ప్రజాశక్తి- సిరిపురం: ఖురాన్ కేవలం ముస్లిముల మత గ్రంథం మాత్రమే కాదని, యావత్ మానవాళికి శాంతి సందేశాన్ని తెలిపే పవిత్రగ్రంథమని సొసైటీ ఆఫ్ ఇంటలెక్చువల్ వాయిస్ ప్రెసిడెంట్, అడ్వకేట్ ఐఎం అహమ్మద్ అన్నారు. ఆదివారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టూడియోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖురాన్ కంఠస్థ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మతసామరస్యం, పర మతసహనం, విలువలతో కూడిన జీవన విధానం, న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం, కుటుంబ వ్యవస్థ, జీవన విధానం అవినీతి నిర్మూలన, మానవత్వ విలువలతో కూడిన నైతిక జీవన విధానం, మరణం తర్వాత జీవితం, భగవంతుని ప్రసన్నసేవ, మనిషి పుట్టుకకు కారణం, మరణం తర్వాత జీవితం తెలుసుకోవాలంటే ప్రతిఒక్కరూ ఖురాన్ గ్రంథాన్ని చదవాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా ఖురాన్ కంఠస్థ పోటీలను నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్. యాసిన్ ఖాన్, జియా అలీఖాన్, సలాం షేక్ బాజీ, అబ్దుల్ గఫర్, శంషాద్ యాసిన్ ఖాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసేనానికి ఘనస్వాగతం



ఆనందపురం కూడలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయనగరం జిల్లా గుంకలాంలో ప్రభుత్వం 397 ఎకరాల విస్తీర్ణంలో కేటాయించిన జగనన్న లేఅవుట్, ఇళ్ళ స్థలాలను పరిశీలించేందుకు వెళ్తున్న : జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు మార్గమధ్యలో మండలంలోని బోడమెట్టపాలెం జంక్షన్ వద్ద జనసేన కార్యకర్తలు, వీర మహిళలు ఘన స్వాగతం పలికారు. పవన్‌కు వీరతిలకం దిద్ది, హారతులిచ్చారు. పంచాయితీ నాయకులు అప్పల నాయుడు, గురునాయుడు, నగర నాయకులు కిరణ్, శ్రీను, రాజు, సతీష్ పాల్గొన్నారు.

గజమాలతో ఘన స్వాగతం

ఆనందపురం: ఆనందపురం కూడలిలో జనసేనాని పవన్‌కల్యాణ్‌కు జనసైనికులు, వీరమహిళలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. క్రేన్‌సాయంతో భారీ మాలను వేసి, పూలవర్షంతో స్వాగతించారు. కారు టాప్ ఎక్కిన పవన్ అందరికీ అభివాదంచేస్తూ దాదాపు ఐదు నిమిషాలు అదే కూడలిలో ఉండి తర్వాత విజయనగరం వెళ్లిపోయారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శాకరి శ్రీనుబాబు, మజ్జి. శ్రీనివాసరావు, డాక్టర్ పిన్నింటి. సన్యాసిరావు, రౌతు నాగరాజు,తమ్మిన అప్పలరాజు, దుక్క. వెంకటరావు, పరిమి. భువనేశ్వరి, టెడ్లపు .నర్సింగరావు తాడివాడ శివకృష్ణ, మీసాలు నాగేశ్వరరావు, బాలు, బొద్దాపు గోవిందు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులిస్తున్న జివిఎల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో నిర్వహించిన 42వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు రాజ్యసభ సభ్యుడు జివిఎల్ .నర్సింగరావు ఆదివారం సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జివిఎల్ మాట్లాడుతూ, ఖేలో ఇండియా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సాహిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల నుంచి 390మంది 30 నుంచి వందేళ్లలోపు మాస్టర్ అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కె.నరసింగరావు, మాస్టర్స్ అథ్లెట్ల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి రామారావు, కార్యదర్శి పేర్ల సత్యారావు, ఉక్కునగరం మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, రోహిణి, పుష్పలత, భువనేశ్వరి పాల్గొన్నారు.

సందిగ్ధంలో చెరకు సరఫరా

★ పెద్దేరు వంతెన మరమ్మతులకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలుపుదల

★ ఆరు కాటాల పరిధిలోని చెరకు రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని వడ్డాది వద్ద పెద్దేరు వంతెన మరమ్మతులకు గురికావడంతో వంతెనకు ఇవతల ఉన్న 6 చెరకు కాటాల పరిధిలోని చెరకు రవాణా పరిస్థితి సందిగ్ధంలో పడింది. గోవాడ చక్కెర కర్మాగారానికి ఫ్యాక్టరీ పరిధిలోని పలు చెరకు కాటాల నుండి చెరకు రవాణా అవుతుంది. ఐదు నెలల క్రితం వరద తాకిడికి పెద్దేరు వంతెన రెండు ఖానాల వద్ద స్లాబ్ కుంగిపోయింది. దీంతో రాళ్లతో తాత్కాలిక మరమ్మతులు చేసి ద్విచక్ర వాహనాలు, కారులు, ఆటోలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఈ వంతెన పైనుండి బస్సులు, లారీలు వంటి భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేశారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు మరమ్మతు చేపట్టిన ప్రాంతంలో రోడ్డు జారిపోవడంతో ప్రస్తుతం పాదచారులు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు.

జిల్లాలోని చోడవరం నియోజకవర్గంలో రైతులు అధికంగా చెరకు సాగు చేపడుతున్నారు. దీనిని గోవాడ చక్కెర కర్మాగారానికి సరఫరా చేస్తుంటారు. కొద్ది మంది రైతులు మాత్రమే బెల్లం క్రషర్ల వద్ద బెల్లం



మరమ్మతులకు గురైన పెద్దేరు వంతెన పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

తయారు చేస్తుంటారు. పెద్దేరు వంతెనకు ఇటువైపున ఉన్న బుచ్చయ్యపేట, తట్టబంద, జి.నాయుడుపాలెం, రోలుగుంట, రావికమతం, చిన్నపాచీల చెరకు కాటాల ద్వారా సుమారు 70వేల నుండి 80 వేల టన్నుల చెరకు గోవాడ ఫ్యాక్టరీకి సరఫరా కావలసి ఉంది. పెద్దేరు వంతెన పైనుండి చెరకు రవాణా అయ్యే పరిస్థితి ప్రస్తుతం కనిపించడంలేదు. దీంతో చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయం అంతంత మాత్రమే..

పైకాటాల నుండి సరఫరా అయ్యే చెరకు ఫ్యాక్టరీకి రవాణా చేయాలంటే సరైన ప్రత్యామ్నాయ రోడ్లు సైతం లేవు. రావికమతం, బుచ్చయ్యపేట, పిఎస్.పేట మీదుగా ఫ్యాక్టరీకి చెరకు తరలించాలంటే ఇది సింగల్ రోడ్డు. పైగా మలుపులు ఎక్కువ. పూర్తి శిథిలావస్థలో ఉంది. రోడ్ల మధ్యలో పెద్ద పెద్ద గొయ్యలు పడ్డాయి. ఈ మార్గంలో చెరకు రవాణా చేస్తే లారీలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కింతలి మీదుగా వడ్డాది చేరుకోవాలంటే అదనంగా 15 కిలోమీటర్లు దూరం పెరగనుంది. ఈ నేపథ్యంలో గతంతో పోలిస్తే ఈ ఏడాది ఫ్యాక్టరీకి చెరకు సరఫరా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. గోవాడ చక్కెర కర్మాగారం ఎమ్‌డి వడ్డాది వంతెనను పరిశీలించి మరమ్మతులు చేపడతామని తెలిపారు. మరమ్మతులు జరగడం ఎప్పుడు, చెరకు రవాణా అయ్యేది ఎప్పుడు అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. వంతెనకు మరమ్మతులు చేస్తారో? లేదంటే దూరభారమైనా ప్రత్యామ్నాయ మార్గంలో చెరకు రవాణా చేస్తారో లేదో వేచి చూడాలి.

ఫ్యాక్టరీకి చెరకును ఎలా సరఫరా చేయాలి



నేను గోవాడ చక్కెర ఫ్యాక్టరీకి 30 టన్నులపైగా చెరకు సరఫరా చేస్తుంటాను. ప్రస్తుతం చెరకు పక్వానికి వచ్చి సరఫరాకు సిద్ధంగా ఉంది. డిసెంబర్ మొదటి వారంలో ఫ్యాక్టరీ ప్రారంభానికి సిద్ధమవుతుంది. 20 రోజులు సమయం కూడా లేదు. వంతెన మరమ్మతుల వలన కాటాలను ప్రారంభించే పరిస్థితులు కానరాలేదు. పండించిన చెరకును ఫ్యాక్టరీకి సరఫరా ఎలా చేయాలో అర్థం కావడం లేదు.

- సుంకర సూరిబాబు, రైతు ,బుచ్చయ్యపేట.



అభివాదం చేస్తున్న క్రీడాకారులు

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో
మహిళా జట్టుకు బ్రాంజ్ మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి

హర్యానా రాష్ట్రంలో ఈ నెల 10వ తేదీ నుంచి జరుగుతున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న జట్టు ఆల్ ఇండియా టీం ఛాంపియన్ షిప్ సీనియర్ మహిళా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ లభించిన మొట్టమొదటి పతకం కావడంతో క్రీడాకారులను ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వైడి రామారావు, చైర్మన్ పివిజిఆర్.నాయుడు (గణబాబు) అభినందించారు. క్రీడాకారులు ఆర్.మౌనిక, జి.హేమ మాధురి, ఎం.ప్రవల్లిక, పి.రేణుక, ఎస్.పల్లవి శ్వేతా శ్రీ, జి.శ్రావణి, కోచ్ మేనేజర్ల జి.రాజు, అలేఖ్య, జాతీయ రెఫరీలు ఎం లక్ష్మణరావు, కె రమేష్ కృషికి జాతీయ టెన్నికాయిట్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్య, సీఈవో బీఎస్ నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి కెఎన్‌వి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయిలో హైజంప్‌లో 'డానియల్'కు రజతం

ప్రజాశక్తి- కశింకోట :

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కశింకోట బాలురు హైస్కూల్ విద్యార్థి డానియల్ హైజంప్‌లో రజతం సాధించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చి అంతర జిల్లాల పోటీలకు అర్హత సాధించారు. రజతం సాధించిన డానియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధరరెడ్డి, పిడి ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అప్పారావు, రామారావు, రవి, సునీత అభినందించారు.



రజత పతకంతో డాయియల్



ధనమ్మ, రమణారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ధనమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట

కసింకోట మాజీ ఎంపీపీ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మలసాల ధనమ్మ పుట్టినరోజు వేడుకలు ఆదివారం మండలంలోని ఎఎస్.పేటలో విశాఖ డెయిరీ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డెయిరీ సూపర్‌వైజర్ పైలా రామచంద్రరావు, పాల సంఘం అధ్యక్షులు తురకలపూడి రాజబాబు, సత్యనారాయణరాజు, కసిరెడ్డి కన్నయ్య, సోమిరెడ్డి గోవింద నారాయణరావు, పాల సంఘం సిబ్బంది ధనమ్మ రమణారావు దంపతులను గజమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ సిబ్బంది జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిని శ్రీనివాసరావు, ప్రసాద్, సంజీవి శ్రీను, గోవిందు దాసురాజా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12, 13 తేదీలలో ప్రకాశం జిల్లాలో జరిగిన 7వ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ అండర్-16 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్లబ్ చెందిన ఆర్.దుర్గాప్రసాద్, పి కోమల, శశివర్ధన్, డి నవీన్, పి ప్రజ్ఞ సుహాసిని, బి జోష్నా ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మండల బాల్ బాడ్మింటన్ క్లబ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.శంకర్రావు, అధ్యక్షులు గొప్ప నరసింహనాయుడు, ప్రధాన






కార్యదర్శి మాసవరపు అప్పారావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో బాగా రాణించాలని కోరారు.







బ్రాండిక్స్ ఆధ్వర్యాన 510 మందికి కంటి పరీక్షలు



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న బ్రాండిక్స్ శ్రీలంక సిఎస్ఆర్ గ్రూపు హెడ్ మల్లికా సమీరవీర, దొరస్వామి తదితరులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో 94వ ఉచిత కంటి వైద్య శిబిరం బ్రాండిక్స్ నేత్ర వైద్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి 550 మంది కంటి రోగులు హాజరు కాగా, 510 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు కంటిచూపు పరీక్షలు చేశారు. ఇందులో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. సాధారణ చికిత్సలతో పాటుగా, 363 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. 74 మందికి మందులు అందించారు. 46 మందికి కేటరాక్ట్ సర్జరీ, ఐదుగురికి ఇతర కంటి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. మిగిలిన వారికి 95వ శిబిరానికి టోకెన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారికి మజ్జిగ, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని శ్రీలంక నుంచి వచ్చిన సిఎస్ఆర్ గ్రూపు హెడ్ మల్లికా సమీరవీర సందర్శించారు. వైద్య శిబిరం పనితీరును ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక వద్ద రూ.387 కోట్లతో నిర్మాణం చేయనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని ఆదివారం కేంద్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తన వెంట వచ్చిన జిల్లా జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. హార్బర్ నిర్మాణానికి ప్రతిపాదించిన పటాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రవితేజ, గ్రామ మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో రోటరీ క్లబ్, వాసవి క్లబ్, సెవెన్ హిల్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు జాజుల రమేష్ ప్రారంభించారు. రోటరీ, వాసవి క్లబ్ సేవలను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఏజీఎం ప్రశాంత్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు త్రినాధ రావు, రాజేష్ నాయుడు, వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి సత్య, కడిమిశెట్టి లక్ష్మణరావు, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు శ్రీదేవి, ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ శ్రీధరాల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవుని ఆలయంలో పూజలు

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని రాజుపాలెం సూర్య దేవుని ఆలయంలో ఆదివారం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, 84వ వార్డు అధ్యక్షులు సిరసపల్లి సన్యాసిరావు, కటారి శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, పార్టీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, తలారి కాశి నాయుడు, తలారి లక్ష్మి ప్రసాద్, గొల్లవెల్లి నరసింగరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దేరు నది నుండి మర్రి గంగరాజు అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ఏపి 31డిఎం3485 ట్రాక్టరులో పి.భీమవరం వైపు తీసుకెళ్తుండగా, మార్గ మధ్యలో బుచ్చయ్యపేట పోలీసులు పట్టుకున్నారు. నిందితునిపై పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి 'పేట తుళ్ళి'

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు ఆదివారం పేట తుళ్ళి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తమిళనాడులోని ఎరుమేలిలో ఓవర్‌స్వామి గుడి వద్ద జరిగే పేట తుళ్ళి (స్వాముల నృత్యం)ని ఆదర్శంగా తీసుకొని ఇక్కడి భక్తులు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయ్యప్ప భక్తులు పార్వతి, శివుడు, సుబ్రహ్మణ్యస్వామి, గణేశుడు పలు దేవతామూర్తుల వేషాలతో తలకు బూరలు కట్టుకొని, రకరకాల రంగులు శరీరానికి పూసుకొని నృత్యం చేస్తూ వీధుల గుండా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగించారు.

15న జిల్లాస్థాయి మహిళా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాక షిరిడి సాయిబాబా ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి మహిళా వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్, మహిళా కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆరిపాక పరిసర ప్రాంతాల చెరుకు రైతులు, పెద్దల సహకారంతో జరగనున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ధ్యాన కేంద్రంలో బాలల దినోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి గ్రామంలోని చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బాలల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన గురువు సుజాత మాట్లాడుతూ ఆదర్శనీయమైన ప్రవర్తన ద్వారా దేశానికి మంచి బాలలను అందించే బాధ్యతలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. విజేతలకు జెఎంజె స్కూల్ సిస్టర్ మంజుల, హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ డైరెక్టర్ గిరీష్ బహుమతులను అందజేశారు.

లీజు పేరుతో అసైన్డ్ భూమి

అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి

- విద్యుత్ కనెక్షన్‌కు భారీగా ముడుపులు?
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి రెవెన్యూ వీరభద్రపేట సమీపంలో 10 ఎకరాల అసైన్డ్ భూమి 99 సంవత్సరాలకు లీజు పేరుతో అన్యాక్రాంతమైందని, రెవెన్యూ అధికారులు ఆ భూమిని వెంటనే స్వాధీనం చేసుకొని లబ్ధిదారులకు తిరిగి అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులుగా ఉన్న స్థానిక గిరిజనులకు డబ్బు ఆశ చూపించి ఈ 10 ఎకరాల అసైన్డ్ భూమిని కె.కోటపాడు మండలం, గుల్లేపల్లికి చెందిన గొర్లె వెంకటలక్ష్మి పేరున 99 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నారని తెలిపారు. ఆ భూమిని చదును చేసి పామాయిల్ తోట వేశారన్నారు. ఇక్కడ ఫారం-3 లేకుండా వ్యవసాయ మోటారు ఎలా



అసైన్డ్ భూమిలో సాగు చేస్తున్న పామాయిల్ మొక్కలు

వేశారని ప్రశ్నించారు. 9/77 యాక్టు ప్రకారం అసైన్డ్ భూముల కొనుగోలు, అమ్మకాలు, లీజులు చెల్లుబాటు కావని, వీటికి భూ యాజమానులు లబ్ధిదారులైన గిరిజనులు అవుతారని, అలాంటప్పుడు లీజుదారు వెంకటలక్ష్మి పేరున విద్యుత్తు కనెక్షన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ అధికారులు భారీగా ముడుపులు తీసుకొని ఈ విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలుస్తోందని విమర్శించారు.

వెంకటలక్ష్మి భర్త అయిన గొర్లె వెంకట అప్పారావు దేవరాపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్‌గా ఉన్నత ఉద్యోగంలో ఉన్నారని, చట్టంపై అవగాహన ఉన్న సదరు వ్యక్తి అసైన్డ్ చట్టాన్ని ఉల్లంగించి, తన భార్య పేరున భూమిని లీజుకు తీసుకోవడమే కాకుండా విద్యుత్ కనెక్షన్ పొందటం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వెంకట అప్పారావుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకున్న ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని ఇలా ఏళ్ల తరబడి లీజుల పేరుతో అడ్డగోలుగా అసైన్డ్ భూములను తమ సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. తక్షణమే అసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధిత చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేసిన మోడీ

టిడిపి నాయకులు నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని, రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేశారని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీల అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని మాట్లాడవలసిన జగన్ రెడ్డి తన కేసులకు భయపడి మోడీ ముందు మోకరిల్లారని ఎద్దేవా చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధానమంత్రి ఢిల్లీ నుంచి రావాల్సిన అవసరం లేదని, అక్కడ నుండి బటన్ నొక్కితే సరిపోతుందని తెలిపారు. షిప్పింగ్ హార్బర్‌ను అదానికి తాకట్టు పెట్టేందుకు రూ.400 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు ప్రధానమంత్రి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రూ.100 కోట్ల ఖర్చు తప్ప రాష్ట్రానికి ప్రధాని నుంచి ఒక పైసా కూడా రాబట్టలేకపోయారని, ఇది ముఖ్యమంత్రి అసమర్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ, దూలం ప్రసాద్, మళ్ల గణేష్, ఇల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్‌పై ప్రధాని ప్రకటన లేకపోవడం దారుణం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కశింకోట : విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్‌పై ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటనలో ప్రస్తావించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని కన్నూరుపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కన్నా తనపై ఉన్న సిబిఐ కేసుల మాఫీపైనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి శ్రద్ధ చూపించారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ విశాఖ పర్యటనలో రాష్ట్రానికి వచ్చిన లాభం ఏమి లేదన్నారు. బాబాయి హత్య కేసు, ఢిల్లీ లిక్కర్ స్కాం నుండి బయటపడేందుకే మోడీ భజన చేశారన్నారు. కేంద్రం మొదలు వంచుతామని చెప్పిన వ్యక్తి ఇప్పుడు దాని ముందు మోకరిల్లారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలో వైసిపి పాత్ర ఉందని మరోసారి రుజువైందన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, నాయకులు కుంద్రపు అక్కు నాయుడు, కన్నూరు ఎర్రి నాయుడు, చెరకం ఈశ్వరరావు, తలారి లక్ష్మీ ప్రసాద్, కరణం కోటి, మనశాల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1871 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కోర్టు సముదాయంలో ఆదివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1871 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలకు కోర్టు మెట్ల ఎక్కి సమయాన్ని, డబ్బును వృధా చేసుకుంటున్నారని తెలిపారు. లోక్ అదాలత్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, అడిషనల్ సివిల్ కోర్టు జడ్జి అమర రంగేశ్వరరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిలు జయచంద్ర, నిరుపమ, ప్రదీప్, బార్ అసోసియేషన్ కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

'అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో 70 జగనన్న కాలనీలు మంజూరు చేసినట్లు తెలిపారు. దొప్పర్లలో గతంలో కేటాయించిన స్థలాలు జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, నాటి తహశీల్దారు 12 స్థలాలను బినామీ పేర్లతో రాయించుకున్నారని ఆ గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ జాబితాను కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్డీవో నలుగురు విఆర్వోలతో ప్రత్యేకంగా విచారణ చేయించి, అక్కడ అర్హులకు స్థలాలు ఇవ్వడానికి కొత్తగా పేర్లు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎలమంచిలిలోని టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో విశాఖలో ఉద్యోగులు చేస్తున్న వారి పేర్లు ఉండటం వల్ల వాటిని రద్దు చేసినట్లు చెప్పారు. పవన్ కల్యాణ్ సినిమా నటుడు వల్లే చంద్రబాబు చెప్పినట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, వైసిపి మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, సీనియర్ నాయకులు కోన బుజ్జి, జెడ్‌పి కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండిమాంబ పుట్టుక మహోత్సవం

ప్రజాశక్తి -యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాక బండిమాంబ పుట్టుక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి వంశీయులైన అన్నం కుటుంబీకులు దర్శించుకున్నారు. పరిసర గ్రామ ప్రజలే కాకుండా జిల్లా నాయకులంతా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు. రాత్రి వరహానది ఒడ్డున పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి, జెడ్‌పిటిసి శానాపతి సంధ్యారాణి రాము, ఎంపిపి బోదెపు గోవిందరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, సీనియర్ నాయకులు దాసరి కుమార్, అల్లుమిల్లి రాజు, విశాఖ గౌరీ సంఘం అధ్యక్షులు ఆడారి అప్పారావు తదితరులు ఉన్నారు.

తంతడి తీరానికి పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం తంతడి సముద్ర తీరానికి అత్యధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ద్విచక్ర వాహనాలు, బస్సులు, కార్లు, వ్యాన్లో మహిళలు, యువకులు, విద్యార్థులు జిల్లా నలుమూలల నుండి వచ్చారు. తీరంలో స్నానాలు చేసి, ఆట, పాటలతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. ఇసుకతిన్నెల్లో కబాడీ తదితర ఆటలను ఆడారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా తీరానికి సముద్రంలో స్నానాలు చేయడానికి విచ్చేసిన వారందరిని పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది చైతన్య పరిచారు. లోతట్టు ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. తీరంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను వారికి చెప్పారు. సాయంత్రం ఐదు గంటలకు తీరానికి వచ్చేవారిని తిరిగి పంపించేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి -చోడవరం : యోగాసనాల ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ అన్నారు. చోడవరం నిర్వహించిన రాష్ట్ర స్థాయి 35వ యోగా ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సీనియర్ జూనియర్ విభాగాల్లో గెలుపొందిన వారికి ధర్మశ్రీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సభ ధర్మశ్రీ మాట్లాడుతూ యోగాకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ పోటీలకు రెండు రోజులపాటు వసతి కల్పించిన ఉషోదయ యాజమాన్యానికి, వివిధ రూపాల్లో విరాళాలు అందించిన దాతలకు నిర్వాహకులు పుల్లేటి సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కళాశాల చైర్మన్ జర్రిపోతుల రమణాజీ, గుప్త, పప్పల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దిబ్బడిలో అంబలం పూజ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడిలో అయ్యప్ప స్వామి భక్తులు శనివారం రాత్రి భారీ అంబలం పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి గుడులను నిర్మించి పూజలు నిర్వహించారు. ఇందులో సమీప గ్రామాల నుండి అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి బుద్ధుని బోధనలే శరణ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రపంచ శాంతికి బుద్ధుని బోధనలే శరణ్యమని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు బోరా వేణుగోపాల్ గౌతమ్, ఆర్గనైజింగ్ ప్రచార కార్యదర్శి బల్ల నాగభూషణం తెలిపారు. బొజ్జన్నకొండ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ఆదివారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుద్ధుని పంచశీల యాత్ర, ప్రపంచ శాంతి ర్యాలీ, ప్రధాన స్థూపం వద్ద బుద్ధునికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల సమాఖ్య సభ్యులు మాటూరి శ్రీనివాసరావు, గుసుపూడి బాబులు, పి.సిద్ధార్థ, వెంకటరావు, లోకేశ్వరరావు, యువి.రావు, హరి తదితరులు పాల్గొన్నారు.

కోటి కుంకుమార్చనలు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో ఆదివారం కోటి తులసి పత్రి పూజ, కోటి కుంకుమ అర్చనలు నిర్వహించారు. అర్చక ఎగ్జామినర్ బంకుపల్లి సత్యనారాయణ, వెంపరాల చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో యాగశాలలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అర్చన, సామూహిక దంపతులచే కుంకుమ పూజలు, కోటి తులసి పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొడ్డేడ సన్యాసి నాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి శివ సూర్యనారాయణ, ఆళ్ల రామలక్ష్మి నరసింహారావు, పెంటకోట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల్లో 'లంపి స్కిన్' కలవరం

పశువులకు ముమ్మరంగా టీకాలు

ప్రజాశక్తి-మాడుగుల:జిల్లా వ్యాప్తంగా పాడి పరిశ్రమపై రైతులు ఆధారపడి జీవించేవారు ఎక్కువ. అనేకమందికి అన్నం పెట్టే పరిశ్రమగా పేరు పొందింది. అయితే ఇటీవలి కాలంలో లంపి స్కిన్ వ్యాధి కారణంగా ఈ పరిశ్రమపై ప్రభావం చూపుతుంది. వ్యాధి సోకిన తరువాత గణనీయంగా పాల దిగుబడి తగ్గుతుంది. ఈ వ్యాధిని మొదట ఆఫ్రికాలో కనుగొన్నారు. మన దేశంలో ఒడిశాలో 2019లో కనుగొన్నారు.ఈ వ్యాధి ప్యాక్స్ విరిడే కుటుంబానికి చెందిన కాప్రి ప్యాక్స్ వైరస్‌తో కలుగుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా ఆవులకు, గేదెలకు సోకుతుంది. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువుల నుండి కీటకాల ద్వారా, వ్యాధి క్రిములతో కలుషితమైన గాలి ద్వారా, స్రావాల నుంచి ఆరోగ్యవంతమైన పశువులకు సోకుతుంది. ముఖ్యంగా కీటకాలైన క్యులెక్స్, ఎడిస్ దోమలు, ష్టో మాక్సిస్ బయోమియా ఈగలు ద్వారా వ్యాధిగ్రస్త పశువుల నుండి ఆరోగ్యవంతమైన పశువుకు వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు

ఈ వైరస్ పశువుల శరీరంలోకి ప్రవేశించిన తర్వాత వ్యాధి లక్షణాలు కనిపించడానికి ఐదు నుండి పది రోజులు పడుతుంది. ఈ వ్యాధి వచ్చినప్పుడు 105 డిగ్రీల వరకు జ్వరం, కళ్ళ నుండి ముక్కు నుండి నీరు కారడం, తరువాత చర్మం కింద ముక్కు దూలం మీద కనితులు, బుడిపెలు ఏర్పడతాయి. మెడ, తొడల దగ్గర లింప్ గ్రంధులు వాచి పొదుగు, రొమ్ము భాగం కాలి కీళ్లలో నీరు చేరుతుంది. వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం వచ్చి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. చర్మంపై ఉన్న బుడిపెలు పుండ్లుగా మారి తర్వాత వాటిపైన పొక్కులు ఏర్పడతాయి. కొన్ని పశువుల కళ్ళల్లో కార్నియా భాగంలో పుండ్లు ఏర్పడి కంటి చూపు మందగించడం జరుగుతుంది. ఈ వ్యాధి పశువుల నుండి మనుషులకు సోకదు.

విరివిగా టీకాలు

లంపి స్కిన్ వ్యాధి రాకుండా జిల్లా వ్యాప్తంగా టీకాల కార్యక్రమం వేగవంతం అయ్యింది. అనకాపల్లి జిల్లాలో పాడి పశువులకు 67,635 టీకాలు వేశారు. మాడుగుల మండలంలో 6,843 టీకాలు వేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా మాడుగుల మండలంలో ఇప్పటివరకు అత్యధికంగా టీకాలు వేయడం వేశారు.

ముందు జాగ్రత్త చర్యలు

లంపీ స్కిన్ వ్యాధి రాకుండా రైతులు అప్రమత్తత పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సంతలలో కొత్త పశువులు కొనుగోలు చేసి తీసుకురావద్దని హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు కనిపించినట్టయితే ఇతర పశువులతో కలపకుండా దూరంగా ఉంచాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.



లంపీ స్కిన్ వ్యాధి పశువు

అప్రమత్తతంగా ఉండాలి

లంపి స్కిన్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తత పాటించాలి. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే తక్షణం పశుసంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించాలి. సంతల్లో పశువులను కొనుగోలు చేయరాదు. వ్యాధి లక్షణాలున్న పశువులను ఇతర మందతో కలిపి ఉంచరాదు.



చిట్టి నాయుడు,
సహాయ సంచాలకులు,
పశు సంవర్ధక శాఖ,మాడుగుల



భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృంద సభ్యులు

ఆకట్టుకున్న సంకీర్తనలు

తప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడులో సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సత్య సాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు. సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సత్య సాయి సమితి ప్రతినిధులు, పలువురు భక్తులు పాల్గొన్నారు .

శోభాయమానంగా రథయాత్ర

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక అయ్యప్ప దేవాలయం నుండి స్వామివారి రథయాత్రను శోభాయమానంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్త, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ రాజేష్ రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వాములకు స్థానిక సుతాపల్లి కుటుంబ సభ్యులు బిక్ష ఏర్పాటు చేశారు.



ఊరేగిస్తున్న భక్తులు

బిఎస్‌పి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలో బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో మండల కమిటీ ఆదివారం ఎన్నికైంది. బిఎస్పీ మండల ప్రెసిడెంట్‌గా కుందేటి పట్టాలు, వైస్ ప్రెసిడెంట్‌గా మోసురి నూకరాజు, కార్యదర్శిగా మేలిపాక శివ, గౌరవ అధ్యక్షులుగా కాపారపు అప్పారావు, కన్వీనర్లుగా వారా నూకరాజు, పోలోజు నాగేష్, కార్యవర్గ సభ్యులుగా సుమారు 15మంది వివిధ గ్రామాలకు సంబందించిన వారు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఎన్.చిరంజీవి, సంజీవ్ వాడపల్లి, కొల్లు గంగాధర్, పాడి బాలరాజు, నైదాన నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆలయ నిర్వాహకులకు పైలా రూ.5వేల విరాళం

ప్రజాశక్తి-చీడికాడ :మండలం తురువోలు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారిని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు పైలా ప్రసాదరావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పర్వదినాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో ఆయన పాల్గొన్నారు. రూ.5,000లు విరాళం నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రుని సింహాచలం నాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, పాత్రుని సురేష్, పాత్రుని శ్రీరామ్మూర్తి, ముర్రు గంగు నాయుడు, రెడ్డి కోటి తదితరులు పాల్గొన్నారు.



నిరాళం ఇస్తున్న పైలా ప్రసాదరావు

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని చిన్నగోగాడ గ్రామంలో గౌరీపరమేశ్వరల నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు గౌరీపరమేశ్వరల ప్రతిమను శిరస్సున మోశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అద్దేపల్లి అప్పారావు, మండల తెలుగు యువత పడాల కన్నంనాయుడు, గొర్లె రాజుబాబు, అద్దేపల్లి సోముబాబు, అద్దేపల్లి ముత్యాలనాయుడు, రామారావు, పైలా యువసేన అధ్యక్షుడు దొగ్గ బలరాం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:స్థానిక లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు విచ్చేసి ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో ఇటువంటి సేవలు మరింతగా చేయాలని అధ్యక్షురాలు చెరుకూరి ఇందిరాకు సూచించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది రోగులకు బిపి, సుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుగర్ వ్యాధి, ఆహారపు అలవాట్లపై వైద్యులు వివరించారు. కార్యదర్శి, వైద్యులు జి.విజయశాంతి, ఎల్.ఎస్. సాధిమ, వైద్యులు బొంతు జగదీష్, లాలం వంశీకృష్ణ సేవలు అందించారు. . ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు జోన్ చైర్మన్ టి.శివశ్రీనివాస్ రాజు, చెరుకూరి సతీష్, వెలగా నారాయణరావు, కుప్పిలి శ్రీనివాసరావు, గుంటూరు చంద్రరాజు, చెరుకూరి రాజ్ నరేన్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిస్టిక్ గవర్నర్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-మాడుగుల:ఈనెల 14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాడుగుల గ్రంథాలయ అధికారి వై.వెంకటేశ్వర్లు తెలిపారు. 14న ప్రారంభోత్సవం, నెహ్రూ చిత్ర పటం ఆవిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, నూతన దరావత్తుల స్వీకరణ, విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన, 16న మ్యూజికల్ చైర్ పోటీలు, 17న మాస్ రీడింగ్ పోటీలు, 18న దేశభక్తి గీతాలు, 18న 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, దిశ చట్టం పై ప్రముఖులతో ప్రసంగాలు, 20న ముగింపు సభ, బహుమతుల ప్రదానం జరుగుతుందని ఆయన తెలిపారు.

నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంధాలయంలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రంధాలయాధికారి కె.జనార్ధన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్‌లను కమిటీ సభ్యులు సమక్షంలో ఆయన విడుదల చేశారు. ఆదివారం గ్రామంలో గ్రంథాలయ వారోత్సవాలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. 14న ప్రారంభోత్సవం, నెహ్రూ చిత్ర పటం ఆవిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంధాలయోద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు, సేవలపై ప్రసంగాలు, 17న చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలు నిర్వహణ, 18న క్రీడలు, 19న మహిళాదినోత్సవం, 20 న ముగింపు వేడుకలతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ కమిటీ సభ్యులు సి.హెచ్. సతీష్, రాజు, నూకరాజు, అప్పలరాజు, హరీష్ పాల్గొన్నారు.

నక్కపల్లి శాఖ గ్రంధాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు తెలిపారు.

చీడికాడ:ఈనెల 14 నుండి గ్రంథాలయ వారోత్స వాలను నిర్వహిస్తున్నట్లు చీడికాడ గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయంలో జరిగే వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

రోలుగుంట:ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్నామని రోలుగుంట గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మీ తెలిపారు. 20న విజేతలకు బహుమతి ప్రధానం చేస్తామని ఆమె తెలిపారు.

వరి పంటకు సుడిదోమ తెగుళ్లు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పలు గ్రామాల్లోని వరి పొలాల్లో సుడిదోమ తెగుళు ప్రబలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రత్నంపేటకు చెందిన విసారపు శ్రీను తన రెండు ఎకరాల్లోని వరి పంట సగానికి పైగా సుడి దోమ కారణంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. నివారణ కోసం మూడు సార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదన్నాడు. మండలంలో ఎంకె.పట్నం, రత్నపేట, శరభవరం, కంచుగుమ్మల, ఎన్.కొత్తూరు గ్రామాల్లో ఎక్కువగా ఈ సమస్య ఉంది. ఈ విషయంపై అధికారులు స్పందించి సలహాలు ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

జనసేన నేతల ఆందోళన

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో జగనన్న కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసైనికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. కాలనీలో రోడ్డు, నీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం లేదని జనసైనికుల వద్ద లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు దేనికి సరిపోవని అన్ని సామగ్రి ధరలు విపరీతంగా పెరిగి పోయాయని వారికి తెలిపారు. ప్రభుత్వం ఇంటికి కనీసం మూడు లక్షలు అయినా మంజూరు చేయాలని వారు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేదని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి నాగేశ్వరరావు, మజ్జి సాయికుమార్, గల్లా స్వామి, రమణ, సీత శేషు ,తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

రమణారావు సేవలు ఎనలేనివి

▶▶ వర్ధంతి సభలో వక్తలు ▶▶ మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

వార్వా, సాహితీ స్రవంతి అభివృద్ధికి కీర్తిశేషులు ఎవి.రమణారావు ఎనలేని కృషిచేశారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కొనియాడారు. వార్వా, సాహితీ స్రవంతి నాయకులు కీర్తిశేషులు ఎవి.రమణారావు ద్వితీయ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వా నాయకులు శాస్త్రి అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. సభలో అజశర్మ మాట్లాడుతూ, అప్పట్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అపార్ట్‌మెంట్ నివాసులకు ఎంతో దగ్గరయ్యారన్నారు. వార్వా నేడు ప్రజల్లోకి వెళ్ళగలిగిందంటే దీనికి ఆయన చేసిన కార్యక్రమాలే కారణమన్నారు. సాహితీ స్రవంతి ఆభ్యున్నతికి కూడా ఎనలేని సేవలందించారన్నారు. ఏ బాధ్యత తీసుకున్నా నిబద్ధత, నిజాయతీతో పూర్తిచేసేవారని తెలిపారు.

సిపిఎం నాయకులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఎవి.రమణారావు నిబద్ధత కలిగిన నాయకులన్నారు. మధ్యతరగతి కాలనీలు, అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉన్న విశాఖలో ఆయన ఎంతో నిబద్ధతతో ఆ సంఘాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. సిపిఎంలో క్రియాశీలక నాయకుడిగా పనిచేశారని తెలిపారు. రమణారావు చేసిన పనిని నేడు ఒకే వ్యక్తి నిర్వహించడం సాధ్యం కానిదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకుల కుమారి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, వార్వా కార్యదర్శి బిబి.గణేష్, ఎవి.రమణారావు సతీమణి పద్మావతి, కుమారుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

రమణారావు వర్ధంతిని పురస్కరించుకొని కళా హాస్పిటల్ సౌజన్యంతో వార్వా, డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన అంజయ్యనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 70 మందికిపైగా పాల్గొని తమ ఆరోగ్య సమస్యలపై వైద్యుల సలహాలు తీసుకున్నారు. కళా హాస్పిటల్ వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.



మాట్లాడుతున్న అజశర్మ

అనకాపల్లిలో...

అనకాపల్లి: ఎవి.రమణారావు ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రమణారావు ద్వితీయ వర్ధంతిని కాళ్ల తేలయ్యబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముందుగా రమణారావు చిత్రపటానికి వార్వా అనకాపల్లి జిల్లా నాయకులు బి.ఉమామహేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, పీర్లెస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులుగా, సిఐటియు నాయకులుగా అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. పీర్లెస్ కంపెనీ విఆర్ఎస్ ప్రకటించగా కార్మికులకు అండగా నిలిచారన్నారు. సిపిఎం మద్దిలపాలెం జోన్ నాయకులుగా బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, పట్టణ నివాస ప్రాంత, అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఎస్‌వి.నాయుడు, టెక్కలి జగ్గఅప్పారావు, పి.చలపతి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళులర్పిస్తున్న బాలకృష్ణ తదితర నాయకులు



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

349వ రోజూ మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 349వ రోజుకు చేరింది. పైపులైన్‌కు వ్యతిరేకంగా శిబిరం వద్ద మత్స్యకార నాయకులు పెద్దపెట్టున్న నినాదాలు చేశారు. హెటిరో కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీతో తమ ఉనికి ప్రమాదకరంగా మారిందన్నారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార జేఏసీ రాష్ట్ర విద్యార్థి ప్రధాన కార్యదర్శి వాసిపిల్లి నూకరాజు, గోసల అంజి, కారె కోదండరావు, కోడకాశీరావు, మైలపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఎస్ రెడ్డి

కత్రిమ మేధారవాణా వ్యవస్థతో
రోడ్డు ప్రమాదాలు నియంత్రణ

ప్రజాశక్తి -పాయకరావుపేట: కృత్రిమ మేధా రవాణా వ్యవస్థ మెరుగు పరచడంతో ట్రాఫిక్‌ను మెరుగు పరచి ప్రమాదాలు నివారించవచ్చని కేంద్ర రహదారి పరిశోధనా సంస్థ ట్రాఫిక్ మరియు రవాణా ప్రణాళిక విభాగపు విశ్రాంత విభాగాధిపతి టిఎస్ రెడ్డి తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసేస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కృత్రిమ మేధా రవాణా వ్యవస్థను మెరుగు పరచడంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అయన విద్యార్థులతో ఆదివారం ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత కాలంలో సాంకేతికను ఉపయోగించి రవాణా వ్యవస్థను కృత్రిమ మేధా వ్యవస్థతో ఆధునీకరించడంతో ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కృత్రిమ మేధ రవాణా వ్యవస్థ ద్వారా ఆలస్యపు ప్రయాణాలు అధిగమించడం, ట్రాఫిక్ నివారణ, వేగ నియంత్రణ, వాహన కాలుష్య నివారణ వంటివి సాధ్యపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్ వికె నరసింహారావు, డైరెక్టర్ డాక్టర్ వివిఎస్ బి.బంగార్రాజు, ప్రిన్సిపల్ కె.వీర్రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. క్రీడాపోటీల్లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ సంబంధిత క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిడి కె.వరహాలబాబు, టి.రమణ, కోటి బాబు, అమర్, పిడిలు రవి, ప్రశాంత్, డి.రవి, శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు

కేంద్రం దిగొచ్చేవరకూ స్టీల్‌ప్లాంట్ రక్షణ పోరాటం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం లేదని కేంద్రం ప్రకటించే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని ప్రభుత్వ రంగ సంస్థల కన్వీనర్, సిఐటియు నేత ఎస్.జ్యోతీశ్వరరావు స్పష్టంచేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 591వ రోజుకు చేరాయి. దీక్షల్లో తూర్పు నౌకాదళ విభాగం ఐఎన్‌సిఇ కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం సూపర్‌వైజర్ కౌన్సిల్ మెంబర్లు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలనే డిమాండ్‌తో భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు.

సొసైటీ అధ్యక్షులు ఎన్.చిన్నారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాలలో నడుస్తుందని, కానీ ప్రభుత్వ విధానాల కారణంగా, సొంత గనులు కేటాయించకపోవడం వల్ల నష్టపోతుందని తెలిపారు. రక్షణ రంగంలో కూడా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలు నిలిపి వేయాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధించాలని, హెచ్‌ఆర్‌ఎపై ఓ.టి చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సొసైటీ కార్యదర్శి వై.శివాజీ, పాలక వర్గ సభ్యులు కెవివివిఎస్‌డి కుమార్, వైఎ.రాజేష్, ఎంవి.రత్నాకరరావు, ఎం.దాస్, ఎవి.సత్యనారాయణ, ఎస్‌కె.అన్వర్, ఆర్.అయ్యప్పన్, వి.వెంకటేష్, బి.రామేశ్వరరావు, ఎన్‌సిఇ యూనియన్ జాయింట్ సెక్రెటరీ బిల్లా భానోజీ, కె.శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : విశాలాంధ్ర 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఆదివారం స్థానిక టర్నర్ సత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో సాహిత్యం, తెలుగు భాష, సంస్కృతి విస్తరణలో విశాలాంధ్ర చేసిన కృషి ఆమోఘం అన్నారు. అన్ని రకాల పుస్తకాలను ఒకే వేదికపై తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి, హిందూ దినపత్రిక బ్యూరో చీఫ్ సుమిత్ భట్టాచార్జీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు, సిపిఐ జివిఎంసి ఫ్లోర్ లీడర్ ఎజె స్టాలిన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ు పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా తుప్పలతో తిప్పలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలతో ప్రజలు, వాహనదారులు తిప్పల పడక తప్పడం లేదు. ప్రధానంగా వెంకటాపురం, పాములవాక, నీళ్ల గుంట, కొడవటి పూడి, ఆక్సాహెబ్ పేట, రాజుపేట, గొట్టివాడ, పందూరు, జగ్గంపేట ఇలా దాదాపుగా అన్ని గ్రామాలలో రోడ్డు ఇరువైపులా పెరిగిన తుప్పలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించు కోలేదని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబురుగా పెరిగిన తుప్పలతో ప్రధానంగా మలుపుల వద్ద ద్విచక్ర వాహనాలకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని, భయభయంగా వాహనాలను నడపాల్సి వస్తోందని పలువురు వాహన దారులు అంటున్నారు. కనీసం ఉపాధి హామీ నిధులతోనైనా రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌కు అధికారులు చొరవ చూపాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



నీలిగుంట ,పాములవాక రోడ్డులో పెరిగిన తుప్పలు